క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈవో ఎల్.చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించండి: కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో 2024–25 వ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, ఖాళీ స్థలం, నీటి కుళాయి పన్నులను ఈనెల 31వ తేదీ లోగా పూర్తిగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు బుధవారం పట్టణ ప్రజలను కోరారు. ఆయా పన్నులను సమీపంలోని మీసేవ కేంద్రం, మున్సిపల్ ఆఫీసు లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఎన్‌సీఆర్‌సీ క్లబ్ ప్రెసిడెంట్ 'చిరుమామిళ్ల' రాజీనామా

నందిగామరూరల్: నందిగామ కల్చరల్ అండ్ రిక్రియేషన్ క్లబ్(ఎన్‌సీఆర్‌సీ) ప్రెసిడెంట్ చిరుమామిళ్ల చైతన్యకుమార్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు తనకు సహకరించిన పాలకవర్గానికి, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరక రాజీనామా పత్రాన్ని క్లబ్ కార్యదర్శికి పంపించినట్లు ఆయన వివరించారు.

సేంద్రీయ ఎరువులతో అధిక ఫలసాయం



పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల గ్రామంలో బుధవారం పొలంబడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగాన్ని మరింత పెంచాలని సూచించారు. నీటి యాజమాన్యం చేపట్టడం, ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు: మండలంలోని బోడవాడ, జమ్మవరం, వెల్లంకి, నందలూరు, దాచవరం, తాటిగుమ్మి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటిఎద్దడి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో అరుంధతీదేవిని పంచాయతీ చాంపియన్స్ కోరారు. వికసిత పంచాయత్ కార్యక్రమంలో భాగంగా పరిపూర్ణ గ్రామ వికాసం కోసం నిర్వహించిన పలు కార్యక్రమాల ద్వారా ఆయా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఎంపీడీఓకు వివరించారు. అనంతరం గుర్తించిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.తాము కేశినేని ఫౌండేషన్, జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ ద్వారా శిక్షణ పొందినట్లు వారు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. జీవీ నరసింహారావు, కాపా రాంబాబు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడులు.. ఇద్దరికి గాయాలు

జి.కొండూరు: పాత కక్షల నేపథ్యంలో మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన జి.కొండూరు మెరక మీద వైన్‌షాపు సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళ్తే.. జి.కొండూరు మండల పరిధి చెర్వుమాధవరం గ్రామానికి చెందిన బాణావతు కోట్యానాయక్, పినపాక శివారు విద్యానగరానికి చెందిన ప్రసాద్‌తో పాటు మరి కొంతమంది కలిసి బుధవారం సాయంత్రం మూడు గంటల సమయం నుంచి జి.కొండూరు మెరకమీద ఉన్న ఓ వైన్ సమీపంలో మద్యం సేవించారు. కాగా ప్రేమ వివాహ విషయమై కోట్యానాయక్, ప్రసాద్ మధ్య తలెత్తిన వివాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. ఈ క్రమంలో అప్పటివరకు తాగిన మద్యం సీసాలను పగలగొట్టి ఒకరిని ఒకరు పొడుచుకున్నారు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ప్రసాద్ అక్కడి నుంచి పరారయ్యాడు. కోట్యానాయక్ మాత్రం గాయాలతో అక్కడే పడి ఉండడంతో స్థానికులు 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ఇబ్రహీంపట్నం: తుమ్మలపాలెంలో గంజాయి విక్రయిస్తున్న కిలేశపురం గ్రామానికి చెందిన నలుగురు యువకులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- కూలీలకు రూ.2.48 కోట్ల బకాయిలు
- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు
- వేతనాలు చెల్లించాలని డిమాండ్



ముక్త్యాల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

జగ్గయ్యపేట: గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను నివారించేందుకు అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో ఉపాధి పథకం కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి పనులు చేసుకునే తమకు ప్రభుత్వం మూడునెలలపాటు వేతనాలు అందకపోతే ఎలా జీవనం సాగించాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు.

పనుల్లో 16వేలమంది కూలీలు...

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలలో 30వేలకు పైగా ఉపాధి హామీ పథకం కూలీలు జాబ్ కార్డులు ఉండగా 16వేల మంది పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వలు, సోపిట్‌లు, కుంటల్లో పూడిక తీత, ప్లాంటేషన్ తదితర పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఈ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులే ఆధారం కావడంతో కూలీలు ఈ పనులకు హాజరవుతూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు మూడునెలలుగా వేతనాలు చెల్లించకపోతుండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు కూడా అధికంగా ఉండటంతో వ్యవసాయ పనులు దాదాపు తగ్గిపోయాయని వారు చెబుతున్నారు. పనిప్రదేశంలో కూలీలకు టెంటు, మంచినీరు వంటి కనీస సదుపాయాలు కల్పించడంలోనూ ఉపాధి హామీ పథకం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కూలీలు వాపోతున్నారు.

రూ.2.48 కోట్ల బకాయిలు..

ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2.48కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జగ్గయ్యపేట మండలంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి 17వ తేదీ వరకు రూ.1.24కోట్లు, వత్సవాయి మండలంలో రూ.39 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలో రూ.85 లక్షల మేర బకాయిలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఒకనెల వేతనం రాకపోతేనే ఇబ్బందులుపడాల్సి వస్తున్న ఈ రోజుల్లో ఏకంగా మూడునెలలుగా వేతనాలు ఇవ్వకపోతే జీవనం ఎలా సాగించాలంటూ కూలీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకం కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు

నెలాఖరు నాటికి చెల్లిస్తాం

ఈ నెలాఖరులోపు ఉపాధి హామీ పథకం బకాయిలు విడుదలయ్యే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లోని కూలీలకు సమాచారం అందించాం. వేసవి కాలంలో పనిప్రదేశంలో కూలీలకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తున్నాం.

–నితిన్, ఎంపీడీవో

మిర్చి రైతులను ఆదుకోవాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తూ, వాటి వాటి పరిష్కారానికి ఉద్యమిస్తున్నట్లు ఆపార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక డీవీఆర్‌నగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకులు షేక్ గౌసిమియా అధ్యక్షతన బుధవారం ఆపార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని వేదాద్రి సమీపంలోని హేమాద్రి సిమెంట్ ఫ్యాక్టరీలో ఇటీవల తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జగ్గయ్యపేట ప్రాంతంలో మిర్చి రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారన్నారు. గతేడాది మిర్చి క్వింటాకు రూ.20వేలు పలుకగా, , ప్రస్తుత కూటమి ప్రభుత్వం మిర్చి క్వింటాకు గిట్టుబాటు ధరను రూ.11,571గా ప్రకటించిందన్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.9వేలు నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లోని పేదలకు ఇళ్లస్థలంగా 3 సెంట్లు, పట్టణాల్లోని వారికి 2 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ మేరకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.9లక్షలు ఆర్థికసాయం అందించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఆదివారం సెలవు ప్రకటించాలని, ఆప్కాస్‌ను రద్దు చేయడం తగదన్నారు. ప్రజా చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలపై ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ధర్నాలు చేయనున్నట్లు చెప్పారు. ఆయా ధర్నాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, మండల కమిటీ నాయకులు కోట కృష్ణ, దంతాల నరేంద్ర, రాజేశ్వరి, డి.భాస్కర్, జె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

8గ్రాముల బంగారం అపహరణ

నందిగామరూరల్: మండలంలోని ఐతవరం గ్రామంలో మంగళవారం రాత్రి తాళాలు వేసి ఉన్న మూడిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. సేకరించిన సమాచారం మేరకు...ఐతవరం గ్రామానికి చెందిన చలమల ఆనందరావు, గోనెల కృష్ణ, గొర్రెపాటి కోటేశ్వరరావు ఆయా పనులపై ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆనందరావు ఇంటి తాళాలు పగులగొట్టి నాలుగు గ్రాముల బంగారం, కృష్ణ నివాసంలో నాలుగు గ్రాముల బంగారం అపహరించారు. కోటేశ్వరరావు నివాసంలో గత నెల రోజుల క్రితమే చోరీ జరగటంతో విలువైన వస్తువులు దొరకకపోవడంతో దుస్తులు అపహరించారు. సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి

నందిగామ రూరల్: మండలంలోని మునగచర్ల గ్రామంలో తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ పంగులూరి వెంకటేశ్వర్లు తెలిపారు.చందర్లపాడు మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ లక్ష్మీశను బుధవారం కలిసి గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు



కంచికచర్ల: స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'ఆగమ 2025' జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 540మంది విద్యార్థులకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, కోడింగ్, హక్‌థాన్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్, కోఆర్డినేటర్ సీహెచ్ పుల్లారావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ సురేంద్రనాథ్, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

మైలవరం: బంధువుల వేధింపులతో మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన పోరాటనగర్‌లో బుధవారం జరిగింది. మైలవరం మండలం పోరాట నగర్‌కు చెందిన ఆంగోతు ఆనందరావు భార్య ఆంగోతు జయ (45) చేయని అప్పులను చెల్లించాలంటూ తన మరిది, మరి కొంతమందితో కలిసి తమను వేధిస్తున్నాడంటూ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా కుమార్తెలు అడ్డుకుని బాధితురాలిని మైలవరం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలు జయ మాట్లాడుతూ పోరాట నగర్‌లో తాము చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నామని, తమకు గ్రామంలో వ్యవసాయ భూమి కూడా ఉందని తెలిపింది. కోళ్ల రవాణాకు లారీని వాయిదాల పద్ధతిలో తీసుకున్నామని తెలిపింది.తన భర్తను తాగుడుకు బానిసను చేసి తన మరిది చేయని అప్పులను కూడా తమపై రుద్దుతూ మరి కొంతమందితో కలిసి ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ తమను మానసిక వేదనకు గురి చేశాడని ఆరోపించింది. లారీని స్వాధీనం చేసుకుని వాయిదాలు చెల్లించాలని, తమకు రూ.లక్షల్లో అప్పుపడ్డారంటూ వ్యవసాయ భూమిని అమ్మి తన అప్పు చెల్లించాలని వేధించారని తెలిపింది. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వారి చదువుకు, పెళ్లిళ్లకు వ్యవసాయ భూమి ఉపయోగపడుతుందని ఆశిస్తే ఆది స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, గత్యంతర లేక తాను ఆత్మహత్యకు యత్నించానని బాధితురాలు తెలిపింది.

వాహనాల రాకపోకలకు అవరోధం



అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని పాలేటి బ్రిడ్జిపై గతేడాది వరదల కారణంగా ఇరువైపులా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈక్రమంలో ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు మరమ్మతులు చేపట్టిని బ్రిడ్జిని వినియోగంలోకి తెచ్చారు. అయితే ఇరుపక్కలా రహదారి ఏర్పాటుకు ఇటీవల కంకర కుప్పలను పోయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిపై కంకర కుప్పలు పోయడంతో ప్రమాదాల బారినపడతామేమోనని వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్దేశించే పర్యావరణ, సామాజిక, పాలనా కారకాలు అనే అంశంపై బ్రహ్మయ్య అండ్ కో సంస్థ మేనేజింగ్ పార్టనర్ పర్వతనేని సంతోష్ కుమార్ కీలక ఉపన్యాసం చేస్తారని, ప్రధాన వక్తలుగా ముంబయికి చెందిన ఐఎస్ఎస్ స్టాక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.హరీష్ శ్రీవాస్తవ, ఎంఎస్‌సీఐ(ముంబయి) సీనియర్ అసోసియేట్ డాక్టర్ టీ .శశిజ్యోత్స్న, కేసీపీ గ్రూప్ ఈహెచ్ఎస్ విభాగాధికారి డాక్టర్ బాలకృష్ణ, సేఫ్ ఎన్విరాన్ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సదస్సునకు సంబంధించిన పూర్తి వివరాలకు సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్ రెహమాన్(98669 65767)ను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో బాలికలకు రజత పతకం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, మేజర్ మన్నేస్వామి తదితరులు

మైలవరం: విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల క్రీడాకారిణులు రజత పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న క్రీడాకారిణులు భువనేశ్వరి, సమీరా, సంధ్యారాణి, రమాకుమారి, సీత, హరిత, బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న హారిక ప్రతిభ కనబర్చి బాల్ బ్యాట్మింటన్ పోటీల్లో రజత పతకం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



నందిగామలో హిందీ పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు డివిజన్ పరిధిలోని 40 పరీక్షా కేంద్రాల్లో 6,056మంది విద్యార్థులకుగాను 5,992 మంది హాజరయ్యారు. 64 మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు తెలిపారు.నందిగామ మండలంలో 1,478మంది విద్యార్థులకుగాను 1,466 మంది హాజరుకాగా, కంచికచర్ల మండలంలో 900 మందికిగాను 890 మంది హాజరయ్యారు. చందర్లపాడు మండలంలో 702 మందికిగాను 692 మంది హాజరుకాగా, వీరులపాడు మండలంలోని 426మంది విద్యార్థులకుగాను 414మంది పరీక్షలకు హాజరయ్యారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని 15 పరీక్షా కేంద్రాల పరిధిలో 2,550మంది విద్యార్థులకుగాను 2,530మంది హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జగ్గయ్యపేట మండలంలో 1,691మంది విద్యార్థులకుగాను 1,683మంది హాజరయ్యారు. పెనుగంచిప్రోలు మండలంలో 461 మంది విద్యార్థులకుగాను 453 మంది, వత్సవాయి మండలంలోని 398 మందికి గాను 394మంది విద్యార్థులకు హిందీ పరీక్షకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అడవి ఆవుల నియంత్రణకు చర్యలు : కలెక్టర్



డ్రోన్ కెమెరాతో అడవి ఆవుల సంచారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

చందర్లపాడు(నందిగామటౌన్): అడవి ఆవుల బారి నుంచి అన్నదాతలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. చందర్లపాడు మండలం వెలది గ్రామ సమీపంలో అడవి ఆవుల కారణంగా దెబ్బతిన్న పంటలను, డ్రోన్ కెమెరాలతో అడవి ఆవుల సంచార ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది తీర ప్రాంత అడవుల్లోని ఆవులు రాత్రి సమయంలో సమీప గ్రామాల్లోని పొలాలను, పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తనదృష్టికి వచ్చిందన్నారు.

అడవి ఆవుల సంచార ప్రాంతాలను, ఆవుల మందల జాడలను డ్రోన్ కెమెరాల సహాయంతో చిత్రీకరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అడవి ఆవుల నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. నిపుణుల సహకారంతో అడవి ఆవులను బంధించడంతోపాటు ప్రత్యేక గోశాలను ఏర్పాటు చేసి, అక్కడికి తరలించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను త్వరలో చేపట్టి అన్నదాతల పంటలను సంరక్షించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.బాలకృష్ణ, డీఎఫ్‌వో సతీష్, తహసీల్దార్ పాల్, ఎస్ఎస్పీ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, రైతు సంఘాల ప్రతినిధి రావూరి రమేష్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: పెనుగంచిప్రోలు అమ్మవారి జాతరలో జరిగిన ఘర్షణకు సంబంధించి అరెస్ట్ అయి రిమాండ్‌పై బందరు జిల్లాజైలుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. వారికి, వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా నిలుస్తుందని వారికి హామీ ఇచ్చారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం దారుణమని తన్నీరు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరు శివాజీ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా కార్యదర్శి నాగబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, చౌడవరపు జగదీష్, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, నంబూరి రవి, న్యాయవాదులు పి.సత్యశ్రీనివాసరావు, శివరాత్రి పృథ్వీ, సర్పంచ్ బోశెట్టి బ్రహ్మం, కాకాని హరి, కన్నమాల శామ్యూల్, చల్లా సుశీల, గొట్టిపాళ్ల సురేష్ పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకోండి : ఎంపీడీఓ

చిల్లకల్లు(జగ్గయ్యపేట):స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా పలు కార్పొరేషన్ల పథకాలకు అర్హులైన వారు ఈనెల 22లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నితిన్ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2024–25 సంబంధించి బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ల నుంచి రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల్లోని అర్హులైన వారు సచివాలయంలో సంప్రదించి ఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, శిక్షణ అనంతరం కుట్టుమిషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.మండలానికి 217 బయోమెట్రిక్ మిషన్లు మంజూరయ్యాయని, వాటిని త్వరలోనే ఆయా గ్రామ సచివాలయాలకు అందజేస్తామని తెలిపారు. ఈనెల 20వతేదీ గురువారం బూదవాడలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు



ఫేర్‌వెల్ వేడుకల్లో విద్యార్థుల సందడి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు కృషిచేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ సూచించారు. ఈఈఈ విభాగం విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు బుధవారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అమర్‌సుధీర్ మాట్లాడుతూ తమ లక్ష్యాలను సాధించేందుకు శ్రమించాలని సూచించారు. ప్రణాళికతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను ఆదిరోహించగలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాల సాధనతో పాటు సామాజిక బాధ్యతలను మరువరాదన్నారు. కళాశాల జీవితం కన్నా సమాజంలో మరింత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, సీఈఓ డాక్టర్ మణికంఠ, అధ్యాపకులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.